సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
మంగళవారం 12-11-2024
సంపుటి: 20 సంచిక: 194
పేజీలు: 4 వెల: రూ.1



## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

(సత్యంన్యూస్, పలాస)

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు హెచ్చరించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ పలాస పరిసర ప్రాంతాల్లో మందుబాబులు, గంజాయి సేవించిన ఆకతాయిలు విచ్చలవిడిగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించినా, అతివేగంతో వాహనాలు నడిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసు పెట్టే అవకాశాలు ఉంటాయని, తల్లిదండ్రులు వారి మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. బైక్ దొంగతనాలు, చైన్‌స్నాచర్స్‌పై నిఘా ఉంచామని తెలిపారు. ఆడవాళ్లపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే సహించేది లేదని, సోషల్ మీడియా మంచి కోసం వాడాలని, తప్పుడు పోస్టులు పెట్టేవారిపై కేసులు కడతామన్నారు. ఇన్‌డీసెంట్ డ్యాన్స్‌లు చేస్తే ఆర్గనైజ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్ట్‌షాపులు, ఇల్లీగల్ ఇసుక రవాణా, సారాపై ప్రత్యేక నిఘా పెట్టామని, పేకాట వంటి వాటిపై కేసులు కడతామని అన్నారు. ఈయనతో పాటు సీఐలు దాడి మోహనరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.





# ఆపగలిగితే.. ఆపండి!

**పోలీసులకు సవాల్ విసురుతున్న పేకాట సిండికేట్**

**సంపాదిస్తున్నదే డిపార్ట్‌మెంట్‌ను మేపడానికేనంటున్న తులసి**

**జూదరులకు పోలీసులతో భరోసా ఇప్పిస్తున్న గోపి**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

"జిల్లా నుంచి పేకాటకు వెళ్తున్నవారిపై పోలీసుల కన్నుంది. ప్రస్తుతానికి మేం రాలేం. కొన్నాళ్లు ఆగితే మంచిదని భావిస్తున్నాం." అని వెనక్కు తగ్గుతున్న జూదరులకు పేకాట నిర్వాహకులు ఎక్కడలేని భరోసా ఇస్తున్నారట. వారిలో ధైర్యం నింపడం కోసం ఏకంగా తాము సంపాదిస్తున్న దానిలో వాటాలు ఎలా అన్నది కూడా ఏకరువు పెడుతున్నారు కూడా. అందులో భాగంగానే "పోలీసులకు రోజుకు రూ.50వేలు ఇస్తున్నాం. మమ్మల్ని ఎందుకు ఆపుతారు? మమ్మల్ని ఆపితే పోలీసులకు రావాల్సిన రూ.50వేలు ఆదాయం పోతుంది కదా.. అందుకే దర్జాగా వస్తున్నాం, వెళుతున్నాం" అంటూ తులసి డిపార్ట్‌మెంట్‌తో తనకున్న సాన్నిహిత్యాన్ని బయటపెడుతున్నారట.

"ఒడిశా పోలీసులతో పోల్చుకుంటే జిల్లా పోలీసులకే ఎక్కువ డబ్బులు ఇస్తున్నాం. రోజుకు రూ.50వేలతో అన్ని స్థాయిల్లో అధికారులను మేనేజ్ చేస్తున్నాం. ఎవరికీ భయపడనవసరం లేదు. నేరుగా మేము ఏర్పాటు చేసే వాహనాల్లో పాతపట్నం, లేదంటే టెక్కలి నుంచి మెళియాపుట్టి మీదుగా రావచ్చు. పేకాట నిర్వహణ ప్రాంతానికి తీసుకువెళ్లే బాధ్యత మేమే చూసుకుంటాం" అని చెబుతున్నట్లు తెలుస్తుంది.

తోటాడకు చెందిన బెండి తులసీ పేకాట ఆడుతున్న వారికి గతంలో మద్యం, సిగరెట్, నీరు అందిస్తూ, గత 20 ఏళ్లుగా పేకాట శిబిరాల నిర్వహణ స్వయం ఉపాధి మార్గంగా మార్చుకున్నాడు. కొన్నాళ్ల క్రితం ఆర్మీలో సిపాయినంటూ పెద్ద బిల్డప్ ఇచ్చి ఉద్యోగ విరమణ తర్వాత తాండ్ర తేజేశ్వరరావును బెండి తులసి పేకాట శిబిరాల నిర్వహణలో భాగస్వామ్యం చేసుకున్నాడు. వీరికి అక్కివరంకు చెందిన సీపాన శ్రీను జత కలిసిన తర్వాత ఈ వ్యాపారం సిండికేట్ అయి మూడు ముక్కలు ఆరు కాయిన్‌లుగా వృద్ధి చెందుతోంది.

వైకాపా హయాంలో నెలకు రూ.3 లక్షలు కప్పం కట్టి పేకాట శిబిరాలను నగర పరిధిలోనే నిర్వహించేవారు. వీరి శిబిరాలకు పోటీగా నడిపిన వారిని స్టేషన్‌లో పెట్టించి పోలీసులతో బెదిరింపులకు పాల్పడుతుండేవాడు. ప్రభుత్వం మారిన తర్వాత, జిల్లాకు కొత్త పోలీస్‌బాస్ వచ్చిన తర్వాత శిబిరాల నిర్వాహకులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మళ్లీ పోలీసు బదిలీలన్నీ పూర్తయిన తర్వాత గతంలో తమకు సహకరించిన సిబ్బంది ద్వారా వాటాలు మాట్లాడుకొని పేకాడిస్తున్నారు. తులసితో భాగస్వాములుగా ఉన్న గోపి బ్యాచ్‌లో నగేష్, బండారి, చల్లా రాజు తదితరులు మైనార్టీలు కావడంతో వీరందరినీ గుప్పెట్లో పెట్టుకొని తులసి ఒక ఆట ఆడుకుంటున్నట్లు తెలుస్తుంది. రోజుకు రూ.70 లక్షలు లావాదేవీలు జరుగుతున్న ఆటలో ఎవరి పేరుతో ఎంత పక్కన పెడుతున్నారు, వాస్తవంగా వారికి ఇచ్చినదెంత అనేది మిగిలిన పార్టనర్లకు తెలుసు. కానీ ఈ సిండికేట్ మొత్తాన్ని తులసి పోలీసు బలంతో నడుపుతుండటం వల్ల కాదని వేరుకుంపటి పెడితే రౌడీషీటర్లతో సహా పోలీసులు ఎలా దాడులు చేస్తారో వీరికి తెలియంది కాదు. అందుకే తులసి ఇచ్చినంత, తాము పుచ్చుకున్నంత అన్న రీతిలో మిగిలిన నిర్వాహకులు అన్నీ మూసుకు కూర్చుంటున్నారు.



**వచ్చే ఏడాది జనవరి నెలాఖరులో వైకాపా అధినేత జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు శ్రీకారం చుడుతున్నారు. ఈలోగా జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో వైకాపా అభ్యర్థులను రాబోయే ఎన్నికలకు బొట్టుపెట్టి సిద్ధంగా ఉంచాలన్న సంకల్పంతో ఉన్నట్టు కనిపిస్తుంది. ఆమదాలవలస నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జిగా చింతాడ రవికుమార్‌ను నియమిస్తూ సోమవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేయడం ఇందుకు నిదర్శనం. అక్కడికి మూడు రోజుల క్రితం ఆమదాలవలసకు గతసారి ప్రాతినిధ్యం వహించిన తమ్మినేని సీతారామ్‌ను విజయవాడ పిలిపించుకొని ఎంపీగా బరిలో నిలవాలని మరోసారి స్పష్టం చేసిన జగన్మోహన్‌రెడ్డి ఆ మాటకే కట్టుబడిపోయారు. ఆమదాలవలస నియోజకవర్గం నుంచి సీతారామ్ చెప్పినవారికి టిక్కెటిచ్చే అవకాశాన్ని పరిశీలిస్తానని, అలాగని కొడుకు, కోడలు, కూతురు అంటే కుదరదని చెప్పినప్పటికీ తన కుమారుడు చిరంజీవి నాగ్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన సీతారామ్ నియోజకవర్గంలో మరో వైకాపా నాయకుడి పేరును సూచించలేకపోయారు. దీంతో తాజాగా చింతాడ రవిని నియమిస్తూ పార్టీ ప్రకటన విడుదల చేసింది.**

# ఇక్కట్లు దాటి ఇన్‌ఛార్జి వరకు..!

- ఆమదాలవలస వైకాపా ఇన్‌ఛార్జిగా చింతాడ
- జనవరిలో జగన్ జిల్లా పర్యటన
- సీతారామ్ పార్లమెంటుకేనని ముందే చెప్పిన 'సత్యం'

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

2024 ఎన్నికలకు జగన్మోహన్‌రెడ్డి నియమించుకున్న అనేక సర్వే సంస్థలు సీతారామ్ ఓడిపోతారన్న అభిప్రాయం వ్యక్తం చేసినప్పటికీ ఈ నియోజకవర్గంలో జరిగిన ముక్కోణపు కుంపటిలో ఏ ఒక్కరికి టిక్కెటిచ్చినా మిగిలినవారు కచ్చితంగా ఓడిస్తారని భావించిన జగన్మోహన్‌రెడ్డి ఆమదాలవలస నియోజకవర్గంలో అమలైన సంక్షేమ పథకాల శాతం బట్టి మరోసారి సీతారామ్ వైపే మొగ్గుచూపారు. గత ఎన్నికల్లో చింతాడ రవికుమార్, సువ్వారి గాంధీలు కూడా వైకాపా టిక్కెట్ ఆశించారు. అయితే సీతారామ్‌కు టిక్కెట్ దక్కడంతో గాంధీ పార్టీని వీడి ఇండిపెండెంట్‌గా పోటీ చేశారు. చింతాడ రవికుమార్ మాత్రం పార్టీ ఆదేశాలు మీరకుండా వైకాపా కోసం పని చేశారు. 2019, 2024ల్లో చింతాడ రవి టిక్కెట్‌ను ఆశించారు. కానీ ఆయనకు అది దక్కలేదు. వైకాపా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అప్పటి విప్ కూన రవికుమార్‌తో చింతాడ రవికుమార్ యుద్ధం చేశారు. అప్పట్లో వైకాపా తరఫున కూన రవికుమార్ మీద అంత స్థాయిలో విరుచుకుపడిన నేత మరొకరు లేరు. సువ్వారి గాంధీకి, కూన రవికుమార్‌కు మధ్య రాజకీయ వైరం ఉన్నా అవన్నీ న్యాయపరంగా కోర్టుల్లో తేల్చుకున్నారు. ఇక సీతారామ్ టీడీపీని విమర్శించాలంటే జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉండి కూడా ప్రెస్‌మీట్లకే పరిమితమయ్యారు. కానీ చింతాడ రవి మాత్రం టీడీపీ హయాంలో ఆమదాలవలసలో జరిగిన అనేక అవకతవకల్లో, అక్రమాల్లో కూన రవి పాత్ర ఉందంటూ నేరుగా టీవీ-9 స్టూడియోలోనే కూర్చున్నారు. ఆ తర్వాత కూన రవి కూడా ఇదే టీవీ ఛానెల్‌లో తనపై వచ్చిన ఆరోపణలపై డిబేట్‌కు వచ్చారు.. అది వేరే విషయం. సీన్ కట్ చేస్తే 2019లో వైకాపా అధికారంలోకి వచ్చింది. సీతారామ్ శాసనసభ స్పీకర్ పదవిని అధిష్టించారు. సరిగ్గా అప్పట్నుంచే చింతాడ రవికుమార్‌కు కౌంట్‌డౌన్ స్టార్ట్ అయింది. సాధారణంగా తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నాయకుడి మాట చెల్లుబాటు కావడం, నాలుగు కాంట్రాక్టులు చేసుకోవడం ఎక్కడైనా ఆనవాయితీ. ప్రస్తుతం ఏ పార్టీ అయినా అదే ఫాలో అవుతుంది. కానీ 2014-19లో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పటి కాలం కంటే 2019-24 మధ్య సొంత పార్టీలోనే చింతాడ రవికుమార్ గడ్డుకాలాన్ని ఎదుర్కొన్నారు. సీతారామ్ స్పీకర్‌గా ఉండటం వల్ల పార్టీ కార్యక్రమాలు చేయడం కుదరదు కాబట్టి వేరేవారితో వీటిని చేయించాలి. అలా కాకుండా వాటిని గాలికొదిలేయడం వల్ల చింతాడ రవికుమార్ స్వయంగా అక్కడో ఆఫీసు తెరిచి పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలు చేసుకొచ్చారు. అయితే ప్రతీసారి ఆయనకు పార్టీయే వెనక్కు తగ్గిపోమని చెప్పిన సందర్భాలు ఉన్నాయి. ఎన్నికలకు దగ్గర్లో భారీ ఎత్తున బైక్‌ర్యాలీకి ప్లాన్ చేస్తే, చివరి నిమిషంలో చింతాడ రవి దాన్ని విరమించుకోవాలని పార్టీ సూచించిన అంశాలు కూడా అప్పట్లో మీడియాలో కథనాలుగా వచ్చాయి. సీతారామ్ మొదటి నుంచి తన కుమారుడి రాజకీయ భవిష్యత్తు కోసం ఆందోళన చెందుతున్నారు. తాను ఎంపీగా పోటీ చేస్తున్నందున ఆమదాలవలస నియోజకవర్గాన్ని తన కుమారుడికి ఇవ్వాలన్న ఆయన వాదనలో ఒక తండ్రి ఆవేదన అర్థమవుతుంది కానీ, పార్టీ ఆలోచన కనిపించడంలేదు. చింతాడ రవి లాంటి నేతలు నియోజకవర్గంలో ఎదిగితే తన కుమారుడి భవిష్యత్తుకు ముప్పు వస్తుందనే కారణంతోనే గడిచిన ఐదేళ్లు తొక్కిపెట్టారు. రాజకీయాల్లో ఇది సాధారణమే కావచ్చు. కానీ పార్టీ కోణంలో గెలుపు గుర్రం, విధేయత, ఓటర్ యాక్సెప్టెన్సీ వంటి అనేక అంశాలు ఉంటాయి. అలా చూసుకుంటే తమ్మినేని చిరంజీవి నాగ్ కంటే చింతాడ రవి బలమైన అభ్యర్థి అని పార్టీ భావించినట్లే కనిపిస్తుంది. జెమిలీ ఎన్నికలు రాకపోతే 2029 వరకు టీడీపీ అధికారంలో ఉంటుంది. అప్పటికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కూన రవికుమార్‌ను ఢీకొట్టడం అంత సులువు కాదు. వాస్తవానికి ఆమదాలవలస నియోజకవర్గంలో తెలుగుదేశమేతర పార్టీకి సీతారామ్‌కు మించిన అభ్యర్థి దొరకరు. కానీ 15 ఏళ్లు అధికారానికి దూరంగా ఉన్నారన్న సానుభూతితో 2019లో సీతారామ్ రాజకీయ చరిత్రలో లేనంత మెజార్టీతో గెలిపిస్తే ఆ ఐదేళ్లు ఆయన కేవలం కొందరివాడిగానే మిగిలిపోయారు. అందుకే గడిచిన ఎన్నికల్లో కూన రవికుమార్ ఆమదాలవలస నియోజకవర్గ మెజార్టీనే తిరగరాశారు. కూన రవిని చింతాడ రవి తట్టుకోగలరా, లేదా అన్నది కాలమే నిర్ణయిస్తుంది. కాకపోతే పార్టీని, అధినాయకత్వాన్ని నమ్ముకుంటే రాజకీయాలు వ్యాపారంగా కాకుండా వ్యసనంగా మారితే ఎప్పటికైనా గుర్తింపు వస్తుందనడానికి చింతాడ రవికుమారే ఒక ఉదాహరణ. సీతారామ్, కూన రవి మాదిరిగా సొంత వర్గమంటూ లేకపోయినా రాజకీయాల్లోకి వచ్చిన దగ్గర్నుంచి అందరిలో మమేకమైపోయిన చింతాడ రవి ఓటుబ్యాంకు ఇతిమిద్ధంగా ఫలానా కులం, ఫలానా గ్రామం, ఫలానా మండలం అని చెప్పలేం. ఎందుకంటే.. 'చింతాడ'కు ఇటువైపు చింతాడ నుంచి అటువైపు బూర్జ వరకు చాలామంది సైన్యం ఉన్నారు. దానికి తోడు పార్టీ వేవ్ కలిసొస్తే ఏదైనా జరగొచ్చు.



• ఎడిటోరియల్

# ఆ ఇద్దరి గెలుపు మంత్రం ఒకటే!

ప్రజాస్వామ్య పవనాలను ఎవరు ఆపగలరు? మరి రెండు నెలల్లో ముగియనున్న 2024 ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామిక సమాజాలకు ఒక మరపురాని ప్రత్యేక సంవత్సరంగా గుర్తుండిపోతుంది. ఈ ఏడాదిలో 60కు పైగా దేశాలలో జాతీయ స్థాయి ఎన్నికలు జరిగాయి. అనేక దేశాలలో ప్రజలు దిగ్భ్రాంతికరమైన తీర్పునిచ్చారు. ప్రభుత్వాలు మారాయి. ఎదురులేని మొనగాళ్లలా వ్యవహరించిన నేతలు అధికార వైభవం కోల్పోవడమో లేక తగ్గిపోవడమో జరిగింది. గతంలో ప్రజల చేత తిరస్కరించబడిన నాయకులు అనూహ్యమైన ప్రజా మద్దతుతో మళ్లీ అధికారానికి వచ్చారు. ఈ ఏడాది వేసవిలో భారతీయ ఓటర్లు నడుస్తున్న చరిత్రను విస్మయపరిచారు. ఆ తర్వాత జూలైలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పథనిర్దేశకులైన బ్రిటిష్ ప్రజలు యువనేత, సాహసోపేత ప్రధానమంత్రి రిషి సునాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటువేశారు. ప్రతిపక్షమైన లేబర్ పార్టీని అనూహ్య మెజారిటీతో గెలిపించారు. అమెరికాలో మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన ఘనవిజయంతో చరిత్ర సృష్టించారు. ప్రజల్లో సాధారణంగా ప్రభుత్వ వ్యతిరేకత ఉంటుందనే సూత్రానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గత సార్వత్రిక ఎన్నికల వరకు ఒక మినహాయింపుగా ఉండేవారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలలో ఆయన పార్టీ సైతం 63 స్థానాలను కోల్పోయింది. ఒక దశాబ్ద కాలంగా బీజేపీలోను, దేశ రాజకీయాలలోను తిరుగులేని రీతిలో ఉన్న ప్రభావ ప్రాబల్యాలకు తీవ్ర విఘాతం వాటిల్లింది. సంపన్న రాజ్యమైన అమెరికాలో సైతం కొత్త ఉద్యోగాల సృష్టి జరగలేదు. ఉన్న ఉద్యోగాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రజల ఆదాయాలు పడిపోయాయి. జీవన వ్యయాలు అంతకంతకు పెరిగిపోసాగాయి. మరి స్వల్ప ఆదాయాలతో బతుకులను ఈడుస్తున్న కార్మిక శ్రేణులు డోనాల్డ్ ట్రంప్‌కు గట్టి మద్దతుదారులుగా ఉండడంలో ఆశ్చర్యమేముంది? అమెరికన్ సమాజం 'వైవిధ్యం'తో వర్ధిల్లాలన్న వాదనను డోనాల్డ్ ట్రంప్ తలకిందులు చేశారు. వలస వచ్చిన, వస్తున్న వారికి వ్యతిరేకంగా ఆయన మాట్లాడారు. భిన్న జాతుల, మతాలకు చెందిన వలసకారులు అమెరికన్ల శ్రేయస్సును దెబ్బ తీస్తున్నారని ఆయన వాదించారు. ట్రంప్ ధోరణి గత లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోడీ, బీజేపీ నాయకుల ధోరణికి భిన్నమైనది కాదు. నాగరిక విలువలు సమున్నతంగా ఉన్న ప్రపంచంలో అయితే, ట్రంప్, మోడీ, యోగి లాంటి నేతల విద్వేషపూరిత వ్యాఖ్యలు తీవ్రంగా గర్హింపబడేవి. అయితే 2024 ఎన్నికల ప్రచారాల్లో అటువంటి వ్యాఖ్యలు ఓటర్లలో అత్యధిక సంఖ్యాకులను తమ ఊహాత్మక 'అంతర్గత' శత్రువుకు వ్యతిరేకంగా పరిణమింపచేశాయి. మన దేశంలో 'భిన్నత్వంలో ఏకత్వం' అనే నెహ్రూ ఆదర్శానికి నిబద్ధులయిన వారిని 'బూటకపు లౌకికవాదులు'గా భావిస్తున్నారిప్పుడు. ఒక విధంగా శక్తివంతమైన రాజకీయ నాయకులు అయిన డోనాల్డ్ ట్రంప్, నరేంద్ర మోడీ ఒకే విధమైన విజయ సూత్రాన్ని కనుగొన్నారు. స్వాతంత్ర్య శతాబ్ది (2047) నాటికి 'వికసిత్ భారత్' అనే స్వప్నాన్ని మోడీ పూయించగా, 'అమెరికాను మళ్లీ గొప్ప దేశం'గా రూపొందిస్తానని డోనాల్డ్ ట్రంప్ వాగ్దానం చేశారు. జాతీయవాద భావోద్వేగాలను దృఢతరం చేసే ఈ జనాకర్షక నినాదాలు ట్రంప్–మోడీ రాజకీయ సందేశాలలో ప్రధానాంశాలుగా ఉంటున్నాయి. 'బయటి వ్యక్తుల' పట్ల భయాలు సృష్టించడం ఇరువురి ప్రచారాలలో ఒక ఉమ్మడి అంశం. అమెరికాలో ప్యూరిటోరికన్, హైతియన్ వలసకారులకు వ్యతిరేకంగా ట్రంప్, భారత్‌లో రోహింగ్యాలు లేదా బంగ్లాదేశీ చొరబాటుదారులకు వ్యతిరేకంగా మోడీ ఉద్దేశపూర్వకంగా అనుసరిస్తున్న వ్యూహాలలో భాగంగానే 'బయటి వ్యక్తుల' పట్ల భయాలు రెచ్చగొట్టడం జరుగుతోంది. ఒక విభిన్న అస్తిత్వాన్ని పటిష్ఠం చేసుకునేందుకు అనుసరిస్తున్న జాగరూక వ్యూహమది. అమెరికాలో ట్రంపియన్ అమెరికనిజం, భారత్‌లో బీజేపీ హిందుత్వ భావజాలాలు ఒక జాతీయవాద దాడిగా వ్యక్తమవుతున్న అదుపులేని, చేయలేని సాంస్కృతిక వక్కాణింపు ప్రాతిపదికపై ప్రభవించినవే. ఈ వ్యూహాలు చెప్పుకోదగిన రీతుల్లో ఫలిస్తున్నాయి. కారణమేమిటి? అటు అమెరికాలోను, ఇటు భారత్ లోను ప్రతిపక్షాలు తమ సొంత ప్రత్యేక విధానాలను ప్రతిపాదించడానికి బదులుగా, భావజాల ప్రత్యర్థుల వ్యక్తిత్వాలను సవాల్ చేయడమనే వలలో చిక్కుకోవడమే. భారత్‌లో ప్రతిపక్షాలు ఎంతకూ మోడీని విమర్శించడానికే పరిమితమవుతున్నాయి. అలాగే అమెరికాలో డెమొక్రాట్లు అమెరికా భవిష్యత్తు విషయమై ఒక సుసంబంధ దార్శనికతతో ఓటర్లను కొత్త సమున్నత లక్ష్యాల సాధనకు ప్రేరేపించడానికి బదులుగా నిరంతరం ట్రంప్ వ్యక్తిత్వంలోని లోపాలు, లొసుగులను ఎండగట్టేందుకే పరిమితమయ్యారు.

## 13న మంగళ కైసిక ద్వాదశి వ్రతాలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13న ఎచ్చెర్ల మండలం లింగాలపేట ఎస్సీ కాలనీ, నందిగామ మండలం పోలవరం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం ఎస్సీ కాలనీలో మంగళ కైసికి ద్వాదశి వ్రతాలు నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం ఆర్గనైజర్ ఎం.లలితమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

## నియోజకవర్గ సమస్యలపై ఆర్డీవోకు తిలక్ వినతి



(సత్యంన్యూస్, టెక్కలి)

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో టెక్కలి నియోజకవర్గంలోని నిరుపేదలు, అర్హులైన లబ్ధిదారులు, వైకాపా సానుభూతిపరులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, వీరికి న్యాయం చేయాలని ఆర్డీవోను వైకాపా టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ కోరారు. సోమవారం టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తిని కలిసి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గంలో వైకాపా సానుభూతిపరులపై జరుగుతున్న అన్యాయం తదితర విషయాలపై దర్యాప్తు జరిపి పేదలకు న్యాయం చేయాలని కోరారు. న్యాయం జరగకుంటే తాము న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ సమస్యలు దర్యాప్తు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టెక్కలి ఎంపీపీ ప్రతినిధి అట్ల రాహుల్, కోటబొమ్మాళి ఎంపీపీ ప్రతినిధి రోణంకి మల్లయ్య, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు సత్తారు సత్యం, సంపతరావు హేమసుందర్ రాజు, బుడ్డ మోహన్‌రెడ్డి, నందిగాం మండల పార్టీ అధ్యక్షులు తమరి ఫల్గుణరావు, జేసీఎస్ కన్వీనర్ జద్యాడ జయరాం, సర్పంచ్‌లు మార్పు నాగభూషణం, కాళ్ల సంజీవ్, బొమ్మాళి గున్నయ్య, పోలాకి మోహన్‌రావు, జీరు బాబూరావు, నందిగాం మండల ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, బెండి ఉదయ్, ధర్మారావు, పంగ రామయ్య పాల్గొన్నారు.

## రైల్వే సమస్యల పరిష్కారంపై డీఆర్‌ఎంతో కలిశెట్టి చర్చ

(సత్యంన్యూస్, విశాఖపట్నం)



విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గంలోని రైల్వే సమస్యల పరిష్కారంపై విశాఖపట్నంలోని వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం కార్యాలయంలో విజయనగరం ఎంపీ, ఐటీ & కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు చర్చించారు. రైల్వే వేగన్ లోడింగ్ పాయింట్ మార్పు, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ హాల్ట్, విజయనగరంలోని రైల్వే అండర్ పాస్, పార్వతీపురం–గుమడా మధ్య ఫ్లైఓవర్ నిర్మాణం, పాలకొండ–రాజం కొత్త రైల్వే లైన్, చీపురుపల్లి రోడ్డు ఓవర్ బ్రిడ్జి తదితర విషయాలపై మాట్లాడారు. ప్రస్తుతం రైల్వే వేగన్ లోడింగ్ పాయింట్‌ను బొబ్బిలి నుంచి కోమటిపల్లి స్టేషన్‌కు మార్చారని, సీతానగరం స్టేషన్‌కు ఈ పాయింట్‌ను మార్చాలని కలిశెట్టి కోరారు. రైలు ప్రయాణంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రత్యేక స్థానముందని, బొబ్బిలి స్టేషన్లో హాల్టింగ్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విజయనగరంలో రైల్వే అండర్ పాస్ గురించి వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు రాష్ట్ర అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కారం చూపాలని కోరారు. పార్వతీపురం – గుమడా మధ్య ఉన్న రైల్వేమార్గంపై ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టాలని ఎంపీ సూచించారు. నూతనంగా ప్రతిపాదించిన పాలకొండ – రాజాం రైల్వే లైన్ నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. చీపురుపల్లి రోడ్డు ఓవర్ బ్రిడ్జిను త్వరగా పూర్తి చేయాలని ఎంపీ అప్పలనాయుడు కోరారు. దీనిపై డీఆర్‌ఎం స్పందిస్తూ సంక్రాంతిలోగా పూర్తవుతుందని తెలిపారు. ఈ రైల్వే అభివృద్ధి కార్యక్రమాలు విజయనగరం నియోజకవర్గంలోని ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని చేపట్టాలని డీఆర్‌ఎంను కలిశెట్టి అభ్యర్థించారు.

## ఆకులతంపరలో అక్రమ తవ్వకాలు

- నిబంధనలు పాటించని ఇసుక రీచ్ నిర్వాహకులు
- జేసీబీ, లారీలు సీజ్ చేసిన రెవిన్యూ అధికారులు

(సత్యంన్యూస్, కొత్తూరు)

అంగూరు రెవెన్యూ పరిధిలోని వంశధార నదీగర్భంలో ఆకులతంపర గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న ర్యాంప్‌లో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ర్యాంప్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంలో జాప్యం, ప్రతిరోజు వీఆర్వో, గ్రామస్థాయి అధికారులు ర్యాంపు వద్ద ఉదయం పూట ఉండి కూడా అక్రమ ఇసుక తవ్వకాలను చోద్యం చూస్తున్నారు. దీనివెనక నియోజకవర్గ స్థాయి నేతలు హస్తం ఉన్నట్లు స్థానికులు భావిస్తున్నారు. అలాగే కొత్తూరు మండలంలో మరో ర్యాంప్‌లో కూడా ఇదే పరిస్థితి. ర్యాంపు ఏడు రోజులు పర్మిషన్ ఉన్నప్పటికీ 17 రోజులుగా తవ్వుతున్న రెవెన్యూ అధికారులు మైనింగ్ శాఖ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు వెళ్లినా చోద్యం చూస్తున్నారు. సీఎల్‌డీసీ కమిటీ సమావేశం జరిగిన తర్వాత కమిటీ ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని నిబంధన మేరకు ర్యాంపు పరిమితిని పెంచుతారు. కానీ రెవెన్యూ మైనింగ్ శాఖలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకుండా ప్రజలను ఏమార్చి నియోజకవర్గ స్థాయి నాయకుల అండతో అక్రమ ఇసుక తవ్వకాలకు అధికారులు అనైతికంగా ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కాగా ఆకులతంపర వ్యవహారంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్పందించిన టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి వంశధార నదీ గర్భంలో జరుపుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై పరిశీలించాలని కొత్తూరు తహసీల్దార్‌ని ఆదేశించారు. ఈ ఆదేశాలపై సోమవారం కొత్తూరు ఆర్ఐ పి.లక్ష్మణ్‌కుమార్ ఇసుక ర్యాంప్‌ను పరిశీలించి, నదీ గర్భంలో జేసీబీ యంత్రంతో టిప్పర్, లారీకు ఇసుకను లోడింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. నిబంధన ప్రకారం ర్యాంప్ వద్ద నదీ గర్భంలో మనుషులతో ఇసుకను వాహనాలకు లోడింగ్ చేసి స్టాక్ పాయింట్ వద్ద తరలించి అక్కడ నుండి జేసీబీతో లోడింగ్ చేయాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా లోడింగ్ జరుగుతున్నట్లు ఆర్ఐ గుర్తించారు. జేసీబీ, టిప్పర్ లారీలు సీజ్ చేసినట్లు తెలిపారు. జేసీబీ, లారీలను కొత్తూరు పోలీసులు స్వాధీనం చేసుకోవాలని స్థానిక ఎస్ఐకి నివేదించామని రెవెన్యూ అధికారులు వివరించారు.






# మెగాస్టార్‌కే.. గాత్రదానం చేశారు!

ఢిల్లీ గణేష్ అనే తమిళ నటుడు నిన్న మరణించారు. ఆయనెవరో తెలుసా? మెగాస్టార్ చిరంజీవికి గాత్రదానం చేసిన వ్యక్తి. ఆశ్చర్యంగా ఉందా? కానీ అది నిజం. కె.బాలచందర్ దర్శకత్వంలో చిరంజీవి ప్రధాన పాత్రలో '47 రోజులు' అనే సినిమాను ఒకేసారి తెలుగు, తమిళ భాషల్లో తీశారు. తెలుగులో చిరంజీవి తన పాత్రకు తానే డబ్బింగ్ చెప్పుకుంటే తమిళంలో ఢిల్లీ గణేష్ డబ్బింగ్ చెప్పారు. ఇది జరిగింది 1981లో. ఆ తర్వాత మరో పదేళ్లకు చిరంజీవి హీరోగా తెలుగులో 'జగదేకవీరుడు అతిలోకసుందరి' సినిమా వచ్చింది. ఆ సినిమాను తమిళంలో 'కాదల్ దేవతై'(ప్రేమ దేవత)గా అనువదించారు. అందులో చిరంజీవికి మరోసారి ఢిల్లీ గణేష్ డబ్బింగ్ చెప్పారు. అలా మెగాస్టార్ చిరంజీవికి రెండుసార్లు గాత్రదానం చేసిన ఘనత ఆయనకు దక్కింది.

పేరులో ఢిల్లీ ఉంది కానీ, ఢిల్లీ గణేష్ పుట్టింది తమిళనాడు రాష్ట్రం తెన్‌కాశి జిల్లాలోని కీళపావూర్ అనే ఊరిలో. అదీ మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చే మూడేళ్ల ముందు. ఒక అక్క, ఒక తమ్ముడి మధ్యన ఆయన. తూత్తుకుడిలో చదువు పూర్తి చేసి, 1964 నుంచి 1974 వరకు భారత వైమానిక దళం (Indian Air Force)లో పని చేశారు. ఉద్యోగరీత్యా ఢిల్లీలో ఉన్న సమయంలో 'దక్షిణభారత నాటక సభ' అనే డ్రామా ట్రూప్‌లో చేరారు. అక్కడ ఎన్నో నాటకాల్లో వివిధ పాత్రలు పోషించారు. ఆ తర్వాత ప్రఖ్యాత నాటకకర్త, నటుడు కాత్తాడి రామ్మూర్తి నాటక సమాజంలో చేరారు. అక్కడ 'డౌరీ కల్యాణ వైభోగమే' నాటకంలో 'కుచేలన్' అనే పాత్ర ఆయనకు విశేషమైన పేరు తెచ్చింది. అక్కడే ఆయనకు 'ఢిల్లీ గణేష్' అనే పేరు స్థిరపడింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం అంటే ఇవాల్టికీ ఎంతో క్రేజ్. ఇక ఆ రోజుల్లో ఎలా ఉండేదో చెప్పాల్సిన పని లేదు. అందునా వైమానిక దళంలో ఉద్యోగం. కానీ నటన అనే క్రేజ్ ముందు అది చిన్నదే అయ్యింది. దాంతో 1974లో తన ఉద్యోగానికి రాజీనామా చేశారు గణేష్. 'డౌరీ కల్యాణ వైభోగమే' నాటకంలో ఆయన నటన గమనించిన కె.బాలచందర్ 'పట్టిన ప్రవేశం'(పట్టణ ప్రవేశం) సినిమాలో అవకాశం ఇచ్చారు. కమల్‌హాసన్, రజినీకాంత్, ప్రకాశ్‌రాజ్, సరిత, గీత లాంటి నటులతోపాటు ఢిల్లీ గణేష్‌కూ బాలచందరే గురువుగా మారారు. సినీ పరిశ్రమలో కొంతమంది లిమిటెడ్ ఆర్టిస్టులుంటారు. తమకొచ్చినంతమేర నటనతో బండి లాగిస్తారు. మరికొందరు కమిటెడ్ ఆర్టిస్టులుంటారు. ఒక పాత్ర కోసం ప్రాణం పెడతారు. ఢిల్లీ గణేష్ కమిటెడ్ ఆర్టిస్టు. అయితే తమిళ సినిమారంగం ఆయన్ని చాన్నాళ్ళపాటు లిమిటెడ్ ఆర్టిస్టుగానే గుర్తించింది. 1981లో 'ఎంగమ్మా మహారాణి' సినిమాలో హీరోగా నటించినా పెద్దగా గుర్తింపు రాలేదు. దీంతో పరిశ్రమ ఆయనకు సహాయక పాత్ర, ఇంటి పెద్ద పాత్ర లేదంటే హీరోకు అన్న, బావ.. ఇలాంటి పాత్రలే ఇస్తూ వచ్చింది. కానీ ఆయనలో అంతకుమించిన ప్రతిభ ఉంది. టైం కోసం వేచి చూస్తూ ఉన్నారు. అప్పుడొచ్చారో నటుడు. ఆయన పేరు కమల్‌హాసన్. 'ఇతను గొప్ప నటుడు. ఇతనిలో అన్ని రకాల పాత్రలూ వేసే ప్రతిభ ఉంది' అని గుర్తించారు కమల్. తన సినిమాల్లో ఆయనకో పాత్ర ఉండేలా చూసుకున్నారు. అలా 1981లో 'రాజాపార్వై' (తెలుగులో 'అమావాస్య చంద్రుడు') సినిమాతో మొదలుపెట్టి, ఆ తర్వాత కమల్‌హాసన్ నటించిన అనేక సినిమాల్లో ఢిల్లీ గణేష్ కీలక పాత్రలు పోషించారు. 'నాయగన్', 'మైకేల్ మదన కామరాజన్', 'అవ్వై షణ్ముగి' (తెలుగులో 'భామనే సత్యభామనే'), 'తెనాలి'.. ఇలాంటి చిత్రాలతో ఢిల్లీ గణేష్ ప్రతిభ అందరికీ తెలిసింది. తగ్గ పాత్రలు దక్కినప్పుడు నటుల ప్రతిభ బయటకు వస్తుంది. ఢిల్లీ గణేష్‌కు అలాంటి అవకాశం 1989లో వచ్చింది. అప్పటిదాకా సహాయక పాత్రలే చేస్తున్న ఆయన చేత 'అపూర్వ సహోదరగల్' (తెలుగులో 'విచిత్ర సోదరులు') సినిమాలో విలన్ పాత్ర చేయించారు దర్శకుడు సింగీతం. అదీ కమల్‌హాసన్ సినిమానే కావడం విశేషం.

'అవ్వై షణ్ముగి' సినిమాలో కమల్‌హాసన్, జెమినీ గణేశన్‌తో సరిసమానంగా ఉండే పాత్రను ఢిల్లీ గణేష్‌కు ఇవ్వాలని అనుకున్నప్పుడు చాలామంది వద్దన్నారు. సీరియస్ రోల్స్ చేసే ఆయనకు అంత కామెడీ రోల్ ఇవ్వడం కరెక్ట్ కాదు, నెగెటివ్ ఫీలింగ్ వచ్చి సినిమాకు మైనస్ అవుతుందని భావించారు. కానీ కమల్‌హాసన్ ధైర్యం చేశారు. 'ఆయన రంగస్థలం నుంచి వచ్చిన నటుడు. ఏ పాత్రైనా పోషించగలరు' అని గట్టి నమ్మకంతో ఉన్నారు. తన పాత్ర కంటే ఢిల్లీ గణేష్ పాత్రకు ఎక్కువ డైలాగులు, కొత్త మేనరిజమ్స్ పెట్టి ఆ పాత్ర బాగా వచ్చేలా చేశారు. ఆ క్రెడిట్ అంతా కమల్ హాసన్‌దేనని ఢిల్లీ గణేష్ చాలా ఇంట ర్వ్యూల్లో చెప్పారు. 'తెనాలి' సినిమాలో కూడా పూర్తి నిడివి ఉన్న డాక్టర్ పంచ భూతం పాత్రను ఆయన చేత చేయిం చారు. ఈ రెండు పాత్రలకూ తెలుగు లో నటుడు ఏవీఎస్ డబ్బింగ్ చెప్పారు.

మొత్తం 400 సినిమాల్లో నటించారు ఢిల్లీ గణేష్. అందులో పది మలయాళం, మూడు తెలుగు(జైత్ర యాత్ర, నాయుడమ్మ, పున్నమినాగు(2009)), మూడు హిందీ సిని మాలున్నాయి. సినిమాల్లో విశేషమైన పేరు వచ్చిన తర్వాత దాదాపు 30 తమిళ సీరియళ్లలో నటించారు. 2018లో 'అమెరికా మాప్పిళ్లై', 2021లో 'నవరస' అనే రెండు వెబ్ సిరీస్‌లలో నటించారు. ఇటీవల విడుదలైన 'ఇండియన్–2' ఆయన చివరి సినిమా. ఏ కమల్‌హాసన్‌తో నటించడం ఆయనకు విశేషమైన పేరు తెచ్చిందో, ఆ కమల్‌హాసన్‌తో చేసిన చిత్రం ఆయన చివరి చిత్రం అయ్యింది. తెలుగులో చంద్రమోహన్, తమిళంలో నగేష్‌లతో సమానమైన గుర్తింపు ఢిల్లీ గణేష్‌కు రావాల్సింది. కానీ ఆ గుర్తింపూ రాలేదు, ఆ స్థాయి అవార్డులూ రాలేదు. అయితే ప్రేక్షకుల దగ్గర మంచి నటుడనే పేరు దక్కింది. అది వాస్తవం.

80 ఏళ్ల వయసులో ఢిల్లీ గణేష్ అనే గొప్ప నటుడు తన పాత్ర చాలించి జీవన రంగస్థలం నుంచి నిష్క్రమించారు. జోహార్.

- వి.సాయివంశీ

## చూపు తిప్పనివ్వడం లేదు!

తెలుగు ప్రేక్షకులకు 'ఆర్ఎక్స్ 100' సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ పాయల్ రాజ్‌పూత్ ఆ తర్వాత టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారింది. తక్కువ సమయంలోనే ఎక్కువ సినిమాల్లో నటించింది. కేవలం హీరోయిన్‌గానే కాకుండా తనకు వచ్చిన ప్రతి ఆఫర్‌ను సద్వినియోగం చేసుకునేందుకు ప్రయత్నాలు చేసింది. అంతే కాకుండా ఐటెం సాంగ్స్‌లోనూ నటించడం ద్వారా ఈ అమ్మడు తన పాపులారిటీని పెంచుకునే ప్రయత్నం చేసింది. సినిమాల్లో ఈ అమ్మడు బిజీ బిజీగా నటించడం మాత్రమే కాకుండా పలు సినిమాలతో మంచి నటిగా పేరు సొంతం చేసుకుంది, అలాగే కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకున్నాయి. కన్నుల విందు పాయల్ రాజ్‌పూత్ చివరగా గత ఏడాది మంగళవారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి సూపర్‌హిట్‌ను సొంతం చేసుకుంది. సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా పాయల్ రాజ్‌పూత్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేయడం జరుగుతోంది. తాజాగా మరోసారి తన అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా నెట్టింట అందరి దృష్టిని ఈ అమ్మడు ఆకర్షించింది. క్లీ వేజ్ షోతో పాటు టాప్ యాంగిల్ ఫోటోను షేర్ చేసిన పాయల్ రాజ్ పూత్ కన్నుల విందు చేసింది అంటూ కామెంట్స్ వస్తున్నాయి. నెట్టింట గతంలో పాయల్ ఎన్నో స్కిన్ షో ఫోటోలు షేర్ చేసింది. అయితే ఈ ఫోటో చాలా స్పెషల్‌గా అందంగా ఉందని ఆమె ఫ్యాన్స్‌తోపాటు పలువురు కామెంట్స్ చేస్తూ లైక్ షేర్ చేస్తూ ఉన్నారు.

- తుపాకి.కామ్ సౌజన్యంతో...



# జ్ఞానానికి..పాండిత్యానికి అర్థాలు మారాయి!



వేదం చదవడం, వేదోపదేశం తీసుకోవడం అంతా ఒక దశలో విజ్ఞానమనే అనుకున్నారు. అందుకే వేదమూ, విజ్ఞానమూ, వేదోపదేశాన్ని ఒకే గాడిలో కట్టగట్టి పదేశారు. అయితే ఆధునిక ఆలోచనా ధోరణితో వైజ్ఞానిక ప్రగతి సాధిస్తున్నకొద్దీ స్పష్టమైందేమంటే.. వేదం గానీ, వేదోపదేశంగానీ విజ్ఞానానికి సరిరావు. వేదాలు, వేదోపదేశాలు గొప్పవి అని విశ్వసించే వారితో మనకు వాదనలేదు. వారి విశ్వాసాలు వారివి. విజ్ఞానం – సైన్సు ఈ విశ్వానిది. సైన్సు..ఏ ఒక్క మతమో విశ్వసించేది కాదు. నిజానికి అన్ని మత విశ్వాసాల్ని బద్దలుకొట్టేది. వాస్తవాల్ని తేటతెల్లం చేసేది సైన్సు. అందువల్ల పూర్వీకులు భావించిన జ్ఞానం వేరు. ఇప్పుడీ అత్యాధునిక యుగంలోని జ్ఞానం వేరు. 'జ్ఞాన మొసగరాదా.. సుజ్ఞాన మొసగరాదా' అని త్యాగరాయ కీర్తన ఉంది. అక్కడ జ్ఞానమంటే ఏమిటీ? ఓ ప్రభూ.. ఓ దేవా నిన్ను పూజించే, నిన్ను కీర్తించే జ్ఞానం నాకివ్వరాదా.. అని ప్రాధేయపడడం. అంతేగాని, మనం అనుక్షణం పీల్చే ప్రాణవాయువు.. ఆక్సిజన్ ఎలా తయారవుతుందన్న అవగాహన ఇమ్మని కాదు. జ్ఞానమంటే గుడ్డిగా ప్రతిదాంట్లో దేవుణ్ణి చూడగలగడం కాదు. దేవుణ్ణి ప్రశ్నించేది జ్ఞానం. దేవుణ్ణి శోధించేది జ్ఞానం. నమ్మడం జ్ఞానం కాదు. నమ్మకాల్ని ఛేధిస్తూ, వాస్తవాల్ని వెలికితీసేది జ్ఞానం. 'జ్ఞాన మొసగరాదా' అంటే ఉన్న ఫళాన ఎవరో ప్రసాదించేది కూడా కాదు.. జ్ఞానం!

మొదట అక్షరాలు, సంఖ్యలు నేర్చుకుని ఆ తర్వాత భూమి గూర్చి, విశ్వం గూర్చి, సమాజం గూర్చి, సమాజంలోని అనేకానేక విషయాల గూర్చి, ముఖ్యంగా జీవ పరిణామం గూర్చి నిరంతరం లోతుగా అధ్యయనం చేస్తూ ఉండడమే జ్ఞానం! ఆదీ–అంతం లేనిది జ్ఞానం!! పరిపూర్ణ జ్ఞానసాధన అంటూ ఏదీ ఉండదు. 'ఉదర పోషణార్థం బహుకృత వేషం' అంటే పొట్ట పోసుకోవడానికి కొందరు నానా గడ్డీ తింటూ జనం ముందు వేషాలు వేస్తుంటారు. వారిదంతా జ్ఞానమూ కాదు. వారంతా జ్ఞాన గురువులూ కాదు.

**గతంలోని రుషుల్ని, సాధువుల్ని, వారు ఆయా కాలాలలో, సమాజాలలో చేస్తూ వచ్చిన కృషిని తక్కువ చేసి మాట్లాడడం కాదు. ఆయా కాలాలకు, ఆయా సమాజాలకు కావల్సింది వారు చేస్తూ వచ్చారు. అది అట్లా ఉండనిద్దాం. అయితే ఇప్పుడు ఆ కాలమూ, ఆ సమాజ స్వరూపమూ పూర్తిగా మారిపోయినపుడు.. ఇంకా మారిపోతూ ఉన్నప్పుడు వేల ఏళ్ల క్రితం రాసుకున్న మంత్రాలు, శ్లోకాలు, కీర్తనలు వగైరా సమకాలీన జీవనానికి ఏమాత్రం ఉపయోగపడవు. ముందు ఆ విషయం గ్రహించుకోవాలి. విహారయాత్రకు వెళ్లి మహాబలిపురం శిల్పాలు, అక్కడి రాతి రథాలు చూసి ఆనందించినట్టు, వీటని కూడా అలాగే పరిగణించాలి. ఆ రథాలు ఎలా ఉపయోగంలోకి రావో, ఈ మంత్రాలూ పనిచేయవు. శ్లోకాలకు, కీర్తనలకు ఏ శక్తీలేదు.**



ఈ విషయం అందరూ గ్రహించుకోవడం మంచిది. లేదూ శక్తి ఉందీ అని ఎవరైనా అంటే.. మంత్రం వేసి చనిపోయిన వారిని బతికించాలి. లేదా బాగా జబ్బు పడ్డవారి ముందు కీర్తనలు పాడి ఆరోగ్యవంతుల్ని చెయ్యాలి. డాక్టర్లు, వైద్యపరికరాలు దరిదాపుల్లో లేకుండా ఈ పనులు చేసి చూపాలి. గతంలోని మంచిని మనం స్వీకరించాలి కదా అని అంటే నిజమే తప్పకుండా స్వీకరించాలి. ఉదాహరణకు **'అబద్ధం ఆడకు' సూక్తి వేల సంవత్సరాల నుంచి ఉంది. దాన్ని స్వీకరిద్దాం. ఆచరిద్దాం.**

బట్టీ పట్టిన శ్లోకాలు అనర్ఘళంగా చదవగలిగితే, భాషా పాండిత్యముంటే.. 'మహా పండితుడు–జ్ఞాని' అని వాడుకలో వ్యవహరిస్తున్నాం. అతనెప్పుడో చిన్నప్పుడు చదువుకున్న అమరం, రామాయణం, భాగవతం వగైరాలు ఒప్పజెప్పడం తప్ప, అందులో సృజనాత్మకత ఏముందీ? అతని ఒరిజినాలిటీ ఏముందీ? ఈ కఠిన వాస్తవాల్ని పరిగణనలోకి తీసుకుని ఆలోచిస్తే మనం 'జ్ఞానం', 'పాండిత్యం' వంటి అనేక పదాలకు నిర్వచనం మార్చుకోవాల్సి ఉంది. ఎందుకంటే వాటి పరిధి పెరిగింది. అవి విస్తరించాయి. ఒక్కోసారి అర్థం కూడా మార్చుకుంటున్నాయి.

**ఈ పంతుళ్లు, పండితులు, జ్యోతిష్యులు, ప్రవచనకారులు, బాబాలు, స్వాములు, పీఠాధిపతులు, మానవ దేవుళ్ల వల్ల ప్రపంచంలో ఎక్కడా రవ్వంతయినా అభివృద్ధి జరగలేదు. గ్యారెంటీగా ఇక ముందు కూడా జరగదు. వీళ్లేమైనా ఆర్థికరంగ నిపుణులా, రక్షణ శాఖ నిపుణులా? చరిత్ర పరిశోధకులా? లేక వీరికి ఏ కళలోనైనా ప్రవేశముందా? వైజ్ఞానిక స్పృహ ఉన్నవారా? కనీసం ఇంగితజ్ఞాన సంపన్నులా? ఏదీకారే? 'విషయం' ఇదీ అనేది లేకుండా జీవాత్మ పరమాత్మ అంటూ మనువాదమంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చెప్పేవారిని పక్కన పెడితే ప్రజలు బాగుపడతారు.** ఎవరికి ఏ విషయం మీద పరిజ్ఞానం ఉందో అది వారి నుంచి తెలుసుకోవాలి. అంతేగానీ, మానసిక బలహీనులకు జనం ఎందుకు సమయమిస్తున్నారో వారే ఆలోచించుకోవాలి. అభూత కల్పనల్ని ఎందుకు నమ్ముతున్నారో వారికి వారే అవలోకించుకోవాలి. బలహీనతల్లోంచి జనం బయటపడితే దొంగస్వాముల ఆటలు సాగవు. జనం తమ ఇంగిత జ్ఞానాన్ని ఉపయోగిస్తే వారికి వారే మేలు చేసుకున్నవారవుతారు.

వాడుకలో లేని సంస్కృత శ్లోకాలు చదివి, జనాన్ని మభ్యపెట్టేవారిది, భయపెట్టే వారిది ఏమాత్రం జ్ఞానం అనిపించుకోదు. భాషా పండితులే కాదు, మత జ్ఞానాన్ని ప్రసాదించే 'పెద్దలు' కూడా కొందరుంటారు. ఇలాంటి వారిది అజ్ఞానమే కానీ, జ్ఞానం కాదు. **'మోడీ ఎన్నికయితే విదేశాల్లో ఉన్న 40 లక్షల కోట్ల నల్లధనాన్ని దేశంలోకి తీసుకొస్తార'ని పతంజలి రామ్‌దేవ్ బాబా చెప్పారు. మోడీ అధికారంలోకి వస్తే 'డాలరు విలువ రూ.40కి దిగువ ఉండేట్టు చూస్తార'ని ఆర్ట్ ఆఫ్ లివింగ్ రవిశంకర్ ప్రవచించారు. ఈ 'జ్ఞానగురువు'ల జోస్యాలు తప్పాయి.** కానీ మీ 'జ్ఞానం' ఇలా తగులబడిందేమని అడిగేవారు లేరు. ఆయా విషయాలలో వీరికి ఏ ప్రవేశం ఉందని ఈ ప్రకటనలిచ్చారు? నిజంగా వారు మహిమాన్వితులే అయితే అవి నిజం కావాలి కదా? అహంభావంతో తమది 'జ్ఞానబోధ' అనుకునే ఇలాంటి జ్ఞాన గురువులు ఆత్మ విమర్శ చేసుకోవాలి. రాజకీయ నేతల సహకారంతో వ్యాపారాలు చేసుకుంటున్న ఈ జ్ఞాన గురువులు వాస్తవాలు గ్రహిస్తే మంచిది.

తమను తాము మోసం చేసుకోకుండా ఉంటే ఇంకా మంచిది. మరోవైపు సామాన్య జనం వివేకవంతులై, అలాంటి వారిపై దృష్టి సారించకుండా, పట్టించుకోకుండా ముందుకు పోవడం అవసరం! నాన్చుడు ధోరణి మాని, పాలకు పాలు, నీళ్లకు నీళ్లుగా ఆలోచించుకోవాల్సి ఉంది. ఆచరించాల్సి ఉంది. సంశయాలతో, సందిగ్ధాలతో బతుకు దుర్భరం చేసుకోనవసరం లేదు.

**- డాక్టర్ దేవరాజు మహారాజు**
**ప్రముఖ సాహితీవేత్త, రిటైర్డ్ బయాలజీ ప్రొఫెసర్**

## కర్రసాములో సిక్కోలుకు పతకాల పంట



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఈ నెల పదో తేదీన గుంటూరులో జరిగిన కర్రసాము సౌత్ జోన్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లాకు చెందిన దేవస్ ఇండియన్ ట్రెడిషనల్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో కర్ర సాము టీం ఓవరాల్ చాంప్ షిప్‌లో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. విజేతలకు బుధవారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్‌క్లబ్ కోఆర్డినేటర్ శాసపు జోగినాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ర సాము మన దేశానికి చెందిన ప్రాచీన యుద్ధ కళని అన్నారు.. యువతీ యువకులు ఆత్మరక్షణకు కర్రసాము నేర్చుకునేవారని, ఆత్మ రక్షణకు నేర్చుకున్న ఈ క్రీడ నేడు కళారూపంగా మారుతుందని అన్నారు. ప్రాచీన సంప్రదాయ యుద్ధకళకు పూర్వ వైభవం తీసుకురావలసిన బాధ్యత అందరిపై ఉందని, కర్ర సాము మహిళలకు రక్షణ కవచంగా పని చేస్తుందని అన్నారు. అంతకన్నా ముందు కర్ర సాము విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గోలీ ఉమామహేశ్వరరావు, గోలీ సంతోష్, ఎం.మల్లిబాబు చేతుల మీదుగా అందజేశారు. కోచ్ బి.హర్షవర్ధన్, సహాయ కోచ్ చిన్న యాదవ్‌లను అతిథులు అభినందించారు. గుంటూరులో సౌత్ జోన్ కర్ర సాము పోటీలకు ఆతిథ్యం ఇచ్చిన తులసి సీడ్స్ ఎండీ తులసి రామచంద్ర చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు.



'సత్యం'లో ప్రకటనల కొరకు సంప్రదించండి
8019 221 221

## ఏయూలో కలాం జయంతి

**(సత్యంన్యూస్, విశాఖపట్నం)**

భారతీయ విద్యావికాసానికి అత్తున్నత ప్రాధాన్యత కల్పించిన భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం జయంతి వేడుకలు, జాతీయ విద్యాదినోత్సవం, మైనార్టీ డే సందర్భంగా విశాఖపట్నం ఆంధ్రా యూనివర్శిటీ అంబేద్కర్ అసెంబ్లీ ఆడిటోరియంలో విశాఖ జిల్లా అబుల్ కలాం అజాద్ ట్రస్ట్ తరపున ఘనంగా నిర్వహించారు. ఏయూ ప్రొఫెసర్ ఖాజా రహమతుల్లా అధ్యక్షతన వివిధ రంగాల ప్రముఖులు, వైస్‌ఛాన్సలర్లు పాల్గొని ఘన నివాళులులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి 15 సూత్రాల అమలుకమిటీ సభ్యులు ఎంఏ బేగ్, సీఐ ఇలియాస్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పదో తరగతి నుంచి పీహెచ్‌డీలో అధిక ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు, ప్రశంసాపత్రాలు అందజేశారు.




## ఇంటర్నేషనల్ అకౌంటెన్సీ డే

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఇంటర్నేషనల్ అకౌంటెన్సీడే కార్యక్రమం ప్రభుత్వ మహిళా కళాశాల అటానమస్ శ్రీకాకుళంలో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ కృష్ణారావు అధ్యక్షత వహించి అకౌంటెన్సీ ప్రపంచవ్యాప్తంగా నేటి వ్యాపార ప్రపంచానికి ఎంతో ఆవశ్యకమన్నారు. కళాశాల అధ్యక్షులు, ముఖ్యఅతిథి డాక్టర్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఫైనాన్షియల్ బడ్జెట్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు అకౌంటింగ్ ఎంతగానో అవసరమని, రోజురోజుకు ప్రపంచవ్యాప్తంగా దీని ప్రాధాన్యత కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. రిటైర్డ్ లెక్చరర్ ఇన్ కామర్స్ అకౌంటెన్సీ కేవీజే రాధాప్రసాద్ మాట్లాడుతూ జీవితంలో వ్యక్తులకు, వ్యాపార, ప్రభుత్వ రంగంలో ఆదాయ వ్యయాలు, బడ్జెట్ రూపొందించటంలో ఎంతో ఉపయోగకారిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్ నారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆదిలక్ష్మి, కామర్స్ అధ్యాపకులు కె.లలితాభాయి, బి.సంతోషిపట్నాయక్, యు.పావని,విద్యార్థులు పాల్గొన్నారు.




## సిటులో చేరిన మున్సిపల్ కార్మికులు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)**

ఏఐటియుసి అనుబంధ యూనియన్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులు, నాయకులు సిటు అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లో చేరారు. మంగళవారం రివర్ వ్యూపార్కు వద్ద జరిగిన సమావేశంలో సిటు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాష్, మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, జిల్లా అధ్యక్షులు అరుగుల గణేష్ సమక్షంలో సిటు సభ్యులుగా చేరారు. కార్మిక సమస్యల పరిష్కారానికి నికరంగా పోరాడుతున్న సిటు విశిష్టతను గమనించి తాము చేరామని వారు తెలిపారు. ఏఐటియుసి నుంచి సిటులో చేరిన వారిలో జలగడుగుల ప్రసాద్, బొమ్మాళి కూర్మారావు, పొట్నూరు గోపిబాబు, నల్లపల్లి జ్యోతి భాస్కరరావు, తుపాకుల శ్రీను, కొవ్వాడ కృష్ణకుమారి, రత్నాల రాజశేఖర్‌లున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు గురుస్వామి, శంకర్, మోహన్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. సిటులో సభ్యులుగా చేరిన వారిని సిటు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిటు కార్మికుల హక్కులు, సమస్యలు పరిష్కారానికి సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. కార్మికవర్గ ఐక్యతకు సిటు కృషి చేస్తోందని తెలిపారు.



## క్షతగాత్ర బాలునికి రూ.40వేలు సాయం



**(సత్యంన్యూస్, పాతపట్నం)**

రవి సాహు సేవలు అందరికీ ఆదర్శం కావాలని, సేవలతో ఆత్మ సంతృప్తి కలుగుతుందని పాతపట్నం సీఐ వానపల్లి రామారావు అన్నారు. మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ పాతపట్నం మండలం సీతారామపల్లి గ్రామం పెద్దవీధికి చెందిన నీలాపు చందు అదే ఆరో తరగతి విద్యార్థి దీపావళి నాడు పేలని బాంబులన్నీ ఒకచోట చేర్చి పేల్చుతుండగా ప్రమాదవశాత్తు చేతిలో పేలడంతో చేయని తీసివేసేసినట్లు తెలిపారు. వీరిది నిరుపేద కుటుంబం కాగా, తండ్రి చిన్నప్పుడే మరణించారు. వీరి కుటుంబ దీనస్థితిని తెలుసుకున్న సారవకోట సచివాలయంలో పశు వైద్య సహాయకుడు రవి సాహు, తనమిత్ర బృందం, సచివాలయ సిబ్బంది, ఇతర దాతల సహకారంతో సమకూర్చిన రూ.40,200 ఆర్థిక సహాయాన్ని మంగళవారం మెళియాపుట్టి పోలీస్‌స్టేషన్ ఆవరణలో బాలుని తల్లికి మెళియాపుట్టి ఎస్ఐ రమేష్ బాబుతో కలసి అందించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఆపదలో ఉండే నిస్సహాయులను ఆదుకోవటం మనందరి బాధ్యతని, రవి సాహుని, వారి మిత్రబృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో రవిసాహు మిత్రబృందం, సారవకోట సచివాలయ సిబ్బంది, మెళియాపుట్టి పోలీస్ స్టేషన్ సిబ్బంది, బాధిత బాలుని కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.




























## క్రీడలతోపాటు చదువుల్లో రాణించాలి

**- జాతీయ స్థాయి క్రీడల్లో సత్తా చాటాలి**
**- ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి**



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

చదువుతో పాటే క్రీడల్లో రాణించాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో జరిగే క్రీడల్లో రాణించి జిల్లా ప్రఖ్యాతిని చాటాలని జిల్లా బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు సూచించారు. ఈనెల 8నుంచి నుంచి మూడురోజుల పాటు నంద్యాలలో శాప్, బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలో జిల్లా గర్ల్స్ విభాగం తృతీయస్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేశారు. గెలుపొందిన క్రీడాకారులు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిశారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో మాట్లాడి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు. జాతీయస్థాయి' బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు (హోంగార్డ్ రాజేశ్వరరావు కుమార్తె) ఎస్.నందిని, ఎం.గాయత్రీలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందిస్తూ జాతీయస్థాయిలో మెరుగైన ప్రదర్శన చూపి క్రీడల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డిఎస్పీ శేషాద్రి, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ ఫిజికల్ డైరెక్టర్ మధు, తదితరులు పాల్గొన్నారు.

## లైబ్రరీలో గ్రోబై విధానం పాటించాలి

**(సత్యంన్యూస్,శ్రీకాకుళం)**

లైబ్రరీలో గ్రోబై విధానంలో పాటిస్తే పిల్లలు సులభంగా చదవగలుగుతారని మండల ఎడ్యుకేషన్ ఆఫీసరు ఎన్. కృష్ణారావు తెలిపారు. యూత్‌క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్కూల్ రెడినెస్, బాలవికాస్ ప్రోగ్రామ్, ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో స్థానిక వైసిబి జిల్లా కార్యాలయంలో ఏడు మండలల్లో ఉన్న 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 10 హైస్కూల్స్‌కి సంబంధించి లైబ్రరీ బుక్స్ పంపిణీపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ లైబ్రరీని పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంస్థ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు మాట్లాడుతూ ప్రాజెక్ట్ వివరాలను తెలియజేశారు. పాఠశాలలోని లైబ్రరీ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం ఎంఈవో ఎన్.కృష్ణారావుతో లైబ్రరీ పుస్తకాలను 20 మాధ్యమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పి.మాధవి, కమ్యూనిటీ ఆర్గనైజర్ వై.శంకరరావు, ఎ.రమణమూర్తి, కె.శ్రావణి, పి.ఉమ మహేశ్వరరావు, జి.హేమాసుందర్, యు.మేహెర్వని, బి.సంతోషి పి.అప్పలనాయుడు, ఐ.రాధ, వై.వాసంతి, వాలంటీర్, సాయికుమారి తదితరులు పాల్గొన్నారు.



## హోంగార్డు కుటుంబానికి చేయూత

**- నగదు చెక్కు అందజేసిన ఎస్పీ మహేశ్వర రెడ్డి -**



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

ఇటీవల అనారోగ్యంతో మరణించిన హోంగార్డు పాలక సెంబుడు కుటుంబానికి ఆర్థిక చేయూతగా నగదు చెక్కును ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అందజేశారు. శ్రీకాకుళం జిల్లా హోంగార్డు విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన సెంబుడు సతీమణి సోములమ్మకు సహచర హోంగార్డు ఉద్యోగులందరు కలిసి ఆర్థిక సహాయంగా స్వతహాగా ఇచ్చిన సుమారు రూ.4.06 లక్షల నగదు చెక్కును మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అందించారు. హోంగార్డు కుటుంబానికి సహచర హోంగార్డులు బాసటగా నిలిచి, వారి ఒక రోజు వేతనాన్ని స్వచ్ఛందంగా ఇవ్వడం చాలా గొప్ప విషయమని, ఎటువంటి అవసరం ఉన్నా పోలీసు శాఖ వారి కుటుంబానికి అండగా ఉంటుందని, సమస్యలుంటే తనను నేరుగా సంప్రదించవచ్చునని ఎస్పీ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ శేషాద్రి, ఏవో సిహెచ్ గోపినాథ్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు హరినాథ్, రవి, హోంగార్డు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జగన్ అక్రమాస్తుల కేసు..
## సుప్రీంకోర్టులో కీలక పరిణామం

**న్యూఢిల్లీ:** వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసు వ్యవహారంలో సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటు చేసుకుంది. టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను సీజేఐ ధర్మాసనం మరో బెంచ్‌కు మార్చింది. జగన్ బెయిల్ రద్దు చేయాలని, విచారణను హైదరాబాద్ నుంచి మార్చాలని టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు గతంలో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా ధర్మాసనం విచారణ జరిపి పిటిషన్లపై విచారణ బెంచ్‌ను మార్చింది.

సీజేఐ ధర్మాసనంలో జస్టిస్ సంజయ్‌కుమార్ సభ్యుడిగా ఉన్నారు. విచారణ ప్రారంభం కాగానే.. ఈ పిటిషన్లు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవని జగన్ తరఫు న్యాయవాది రంజిత్‌కుమార్ తెలిపారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో కౌంటర్ దాఖలు చేసేందుకు తమకు కూడా కొంత సమయం కావాలని సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. ఈ క్రమంలో జస్టిస్ సంజయ్ కుమార్ 'నాట్ బిఫోర్ మీ' అనడంతో రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్లను మరో ధర్మాసనానికి సీజేఐ బదిలీ చేశారు. జస్టిస్ అభయ్ ఎస్ ఓకా నేతృత్వంలోని ధర్మాసనం ముందు డిసెంబర్ 2న విచారణకు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

## వన్యప్రాణులను తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్ల ముఠా

**- ముగ్గురు కర్ణాటకకు చెందిన వారు అరెస్టు**



**(సత్యంన్యూస్, పలాస)**

కారులో వన్యప్రాణులను తరలిస్తున్న అంతర్రాష్ట్ర స్మగ్లర్ల ముఠా గుట్టను కాశీబుగ్గ అటవీశాఖ అధికారులు రట్టు చేశారు. కాశీబుగ్గ అటవీరేంజ్ పరిధిలో ఇచ్ఛాపురం చెక్‌పోస్ట్ దగ్గర కారులో వన్యప్రాణులను తరలిస్తున్న ముగ్గురు కర్ణాటకకు చెందిన స్మగ్లర్లను కాశీబుగ్గ అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేసినట్టు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎ.మురళీకృష్ణమనాయుడు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటకకు చెందిన అంతర్రాష్ట్ర వన్యప్రాణుల స్మగ్లర్ల గ్యాంగ్‌కారులో ఒడిశా నుంచి కర్ణాటకకు వన్యప్రాణులతో వెళ్తుండగా అటవీ శాఖ అధికారులు పట్టుకున్నట్టు వెల్లడించారు. కారు సీజ్ చేసిన అటవీ అధికారులు అందులో ఉన్న 21వన్యప్రాణులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 17కొండచిలువ పిల్లలు, 3 తాబేళ్ల, ఒక అడవి పిల్లి ఉన్నట్టు తెలిపారు. వాహనంతోపాటు వన్య ప్రాణులను కాశీబుగ్గ అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి తరలించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు. స్వాధీనం చేకున్న వన్యప్రాణులను విశాఖ జూకు తరలిస్తామని వెల్లడించారు.

## 13న వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహన

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**



భారత ప్రభుత్వం వృద్ధుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని తీసుకువచ్చిన వయోవృద్ధుల సంరక్షణ చట్టం 2007పై బుధవారం శ్రీకాకుళం జిల్లా న్యాయస్థానం ఆవరణలో 10:30 గంటలకు అవగాహన సదస్సు జరుగుతుందని శ్రీకాకుళం జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంరక్షణ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో ఉన్న వయోవృద్ధులు, పిల్లల నిర్లక్ష్యానికి గురైన తల్లిదండ్రులు ఈ సదస్సుకు హాజరు కావాలని ఆమె కోరారు. శ్రీకాకుళం నగరంలో ఉన్న రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆమె కోరారు.

## అభివృద్ధి ప్రణాళిక శిక్షణ తరగతులు

**(సత్యంన్యూస్, రణస్థలం)**

స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో మంగళవారం నిర్వహించిన పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్ 2024-25 శిక్షణ తరగతుల్లో ఎంపీపీ ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ టొంపల సీతారాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌లో భాగంగా పంచాయతీ డెవలప్మెంట్ ప్రణాళిక అవసరం అని అందులోభాగంగా బలమైన పంచాయతీ వ్యవస్థ, గుడ్ గవర్నన్స్, ఎకనామిక్ ఎంపవర్మెంట్ లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు, కార్యక్రమంలో స్పెషలాఫీసర్ కె.వి.రమణమూర్తి, ఎంపీడీఓ సూపరింటెండెంట్ ధనుంజయరావు, ఈఓపీఆర్డీ ప్రకాశరావు, ఏపీఓ, గ్రామసంఘం అధ్యక్షులు, పంచాయతీ కార్యదర్శులు డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.



## స్టాఫ్‌నర్స్ పోస్టును భర్తీ చేయాలి

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

గార మండలం శ్రీకూర్మం పీహెచ్‌సీలో రెండేళ్ళుగా ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్స్, వాచ్‌మెన్ పోస్టును భర్తీ చేయాలని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్‌బి. మీనాక్షిని పీహెచ్‌సీ మాజీ చైర్మన్ ఎం.ప్రభాకరరావు, మాజీ ఎంపీటీసీ జి. సురేష్, నీటి సంఘం చైర్మన్ గిరి, ఎస్ఎంసీ చైర్మన్ సుందరరావులు కోరారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా అధికారిని కలిసి వినతి పత్రం అందించారు. స్టాఫ్ నర్స్ లేకపోవడం వల్ల స్థానికంగా సిబ్బంది కొరత ఏర్పడిందని వివరించారు. వాచ్‌మెన్ లేకపోవడం వల్ల రాత్రివేళ ఆసుపత్రిలో కొందరు ఆక్రమంగా చొరబడి అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడుతున్నారని వివరించారు. దీనిపై స్పందించిన డీఎం అండ్‌హెచ్‌వో ఉన్నతాధికారులతో మాట్లాడి స్టాఫ్‌నర్స్ పోస్టును భర్తీ చేయించి వాచ్‌మెన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.



## ఏకహం 24 గంటల భజన



**(సత్యంన్యూస్, శ్రీకాకుళంరూరల్ )**

పొన్నాడ పంచాయతీ బింగిపేట గ్రామంలో కార్తీకమాస ఏకాదశి సందర్భంగా నగరంలోని చంపాగల్లి వీధికి చెందిన శ్రీ విఘ్నేశ్వర భజన బృందం ఏకహం 24గంటల భజనను నిర్వహించారు. కార్యక్రమంలో రామమందిరం గ్రామపెద్ద అసిరినాయుడు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ప్రతి ఏడాది కార్తీక మాసం వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భజన నిర్వహించిన హిమబాబు బృందంకు ధన్యవాదాలు తెలిపారు. భజనబృందం అధ్యక్షులు హిమాబాబు మాట్లాడుతూ ఏకహం 24గంటల భజన నిర్వహంచే అవకాశాన్ని కల్పించిన శ్రీరామమందిరం భక్త సమాజంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దాసు రామారావు పెద్దపాడు రమణమూర్తి, సోదవరం ఈశ్వరరావు, హార్మోనిస్టు జి.కామేష్, డోలాకిస్టు రమణమూర్తి, సుబ్రహ్మణ్యం, లక్ష్మణ, గణేష్, ఉమా, జన, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 14 నుంచి 20 వరకు సహకార వారోత్సవాలు

**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

71వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహిస్తున్నట్టు జిల్లా సహకార అధికారి బి.నగేష్, డీసీసీబీ సీఈఓ వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు అఖిల భారత సహకార వారోత్సవాలు పోస్టర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌తో కలసి మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్లో పోస్టర్‌ను విడుదల చేసారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు జిల్లావ్యాప్తంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు జిల్లా సహకార అధికారి బి నగేష్, డీసీసీబీ సీఈఓ వరప్రసాద్ తెలిపారు.



## తాగునీరు అందించడంలోనూ విఫలమయ్యారు

**- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి**

**(సత్యంన్యూస్, పాతపట్నం)**



నీటి ద్వారా వచ్చే వ్యాధులను గణనీయంగా తగ్గిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించడానికి రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి వ్యక్తిగత గృహ కుళాయి కనెక్షన్ల ద్వారా నీటి నాణ్యత ప్రమాణాలు అనుసరిస్తూ స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వైకాపా ప్రభుత్వ హయాంలో జలజీవన మిషన్ పనులకు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని, అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాగునీరు అందించడంలోనూ విఫలమయిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆరోపించారు. గ్రామీణ ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరాకు జగన్ ప్రభుత్వం తీసుకున్న చర్యల ద్వారా ఆంధ్రప్రదేశ్, దేశంలోనే ప్రథమ స్థానంలోనే నిలిచిందని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించిన విషయాన్ని రెడ్డి శాంతి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి 180 రోజులు పూర్తయినప్పటికీ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారని, ప్రజలకు మంచి నీటి సౌకర్యం కల్పించడానికి ఒక్క పని కూడా ప్రారంభించలేదని రెడ్డి శాంతి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు పూర్తి చేయాలి

**- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**(సత్యంన్యూస్, శ్రీకాకుళం)**

పలాస రైల్వేఓవర్ బ్రిడ్జ్‌కు సంబందించిన భూసేకరణ వేగవంతం చేసి మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్‌తో కలసి కలెక్టర్ రెవెన్యూ అధికారులతో జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జ్‌లకు సంబంధించిన భూసేకరణపై రైల్వే, రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలాస రైల్వే ఓవర్‌బ్రిడ్జ్‌కు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయని రైల్వే అధికారులు వివరించారు. పలాస ఆర్‌ఓబికి సంబంధించి పనులు పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని ఆర్డీవో తెలిపారు. నరసన్నపేట జమ్మూ జంక్షన్ నుంచి పాతపట్నం ఎన్‌హెచ్ 326ఏ బైపాస్ రోడ్డు పనులకు సంబంధించి పనుల పురోగతిపై ఆరా తీశారు. వ్యవసాయ మార్కెటింగ్‌యార్డ్‌కి సంబంధించి ఎటువంటి సమస్యలు లేవని మార్కెటింగ్ అధికారులు తెలిపారు. ట్రాన్స్‌కోకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించి పనులు ప్రారంభించి మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. అలాగే సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం అన్నారు. ఎన్‌హెచ్ 326ఏ రేపటినుండి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో రెవిన్యూ డివిజన్ అధికారి సాయిప్రత్యూష, ఎస్.ఈ ట్రాన్స్‌కో కృష్ణమూర్తి, ఆర్ అండ్ బి.ఎస్.ఇ జాన్ సుధాకర్, ఏస్డీసీ యూనిట్-4 లావణ్య, మార్కెటింగ్ ఎడిబి రవికుమార్, పలాస రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేశ్వర రావు వీడియో కాన్ఫరెన్స్‌లో హాజరయ్యారు.

## ప్రజాపోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

**(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)**

ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రజాపోరులో భాగంగా ఈనెల 14న ధర్నాలు జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఎచ్చెర్ల మండల కేంద్రంలో ప్రజాపోరు గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఇంధన సర్దుబాటు ఛార్జీల ప్రతిపాదన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని, వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు తొలగించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో వివిధ రూపాలలో మోపిన విద్యుత్తు, ఇతర భారాలను తగ్గిస్తామని, ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఆ హామీకి భిన్నంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికే వివిధ రకాల పేర్లతో అన్నింటిపై అధిక భారాలు ప్రజలు మోస్తున్నారని, నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో లేనివిధంగా ఆకాశాన్నంటాయన్నారు. ప్రజలకు ఉపశమనం కలిగించాల్సింది పోయి, ఇలాంటి అదనపు భారాలు మోపటం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు డి.బంగార్రాజు, టి.రామారావు, ఏపీ హమాలీస్ యూనియన్ నాయకులు ఎం.సురేష్, కె.గోవింద్‌కుమార్, జి.శ్రీను, ఎల్.రాము, ఎల్.సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.